ముస్లిం మైనార్టీల పక్షపాతి వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ముస్లిం మైనార్టీల పక్షపాతి ప్రభుత్వమని అన్నమయ్య జిల్లా వైసిపి విభాగం మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఫయాజుర్ రెహ్మాన్ పేర్కొన్నారు. 2015లో జరిగిన బక్రీద్ అల్లర్ల కేసును కొట్టి వేసిన సందర్భంగా బాధితులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం సందర్భంగా సంప్రదాయ కుర్బానీలో భాగంగా నిర్వహించుకునే పండుగలో భాగంగా కొంతమంది కుట్రలు పన్ని అల్లర్లు జరిగేలా ప్రేరేపించి పైశాచిక ఆనందం పొందారని చెప్పారు. సున్నితమైన విషయాలపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ లేని వారిపై కేసులు బనాయించడం చాలా బాధాకరం. అన్ని సామాజిక వర్గాల ప్రజలకు అండగా ఉంటూ మత సామరస్యం పెంపొందేలా బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రజా ప్రతినిధులే స్వార్థ రాజకీయాల కోసం కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు.

మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ఎండుగడ్డికి గడ్డు కాలం!

- సంక్షోభంలో పాడి పరిశ్రమ
- వేసవికి ముందే పచ్చిమేత కొరత
- ఆవులను తెగనమ్ముకుంటున్న రైతులు
- కబేళాలకు తరలుతున్న జీవనాధారం

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. కనీసం పశువులకు పచ్చిమేత అందించలేక పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి పశుపోషణ అందకపోవడంతో పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవి ముందే కొర్రీ కరువు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. మదనపల్లి నియోజకవర్గంలోని రామసముద్రం మండలంలో పశుగ్రాసం కొరత ఏర్పడింది. వేసవికాలంలో పాడిరైతులు పశుగ్రాసానికి అవస్థలు పడ్డారు. పాడి పరిశ్రమకు కష్టకాలం నడుస్తోంది. గ్రాసం కరువై తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. పాడికి పచ్చి మేత ప్రధానం. తీవ్ర ఎండ పరిస్థితులతో పచ్చిమేతకు డిమాండ్ పెరిగింది. వేసవి ఆరంభంలోనే పాలదిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. వెంటాడుతున్న వేసవి తాపంతో పశుగ్రాసం, నీటికొరతలు పశువులకు జీవన్మరణ సమస్యగా మారింది. మండల ప్రాంతంలో ఈ సమస్య అధికంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలు కొన్నాళ్లు మాత్రమే ఊరటనిచ్చింది. ఏడాదికేడాది పశుగ్రాసం కొరత తీవ్రమైంది. పైగా ఈ ఏడాది కొన్ని చోట్ల గడ్డి దొరికే పరిస్థితిలేదు. చేసేదిలేక పశువులను రైతులు వచ్చినకాడికి తెగనమ్ముకుంటున్నారు. వేలాది కుటుంబాలకు జీవనోపాధి చూపుతున్న పాడిపరిశ్రమకు విఘాతం కలగడంతో దానిపైనే ఆధారపడిన మిగతావారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.

మండలంలో కొన్ని చోట్ల పశువులకు పశు గ్రాసం కొరత తీవ్రరూపం దాల్చింది. పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులను మేపలేని పరిస్థితి తలెత్తడంతో రైతులు వాటిని తెగనమ్ముకునే దుస్థితి దాపురించింది. రూ.70 వేల విలువైన ఆవును రూ.30 వేల అమ్ముతున్నారంటే పాడిపరిశ్రమ ఎంత సంక్షోభంలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పశుపోషకులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పొలాల్లోని తాగునీటి కుంటల్లో చుక్కనీరు లేని పరిస్థితి ఏర్పడింది. పొలాల్లో ఉండే పశువులు సైతం నీళ్లకోసం ఇంటికి తోలుకొస్తున్నారు. మూగజీవాలకు పశుగ్రాసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయలు వెచ్చించి వరిగడ్డి కొనుగోలు చేసి మండలానికి దిగుమతులు చేస్తున్నారు. ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా పశువుల మేత పెంపకానికి కార్యక్రమాలు చేస్తున్న క్షేత్రస్థాయిలో రైతులకు అందడం లేదు. పశు సంవర్ధక శాఖ పంపిణీ చేస్తున్న పశుగ్రాసం, విత్తనాపంపిణీ మొక్కుబడిగా మారింది. కనీసం ఎండుగడ్డి దొరక్క లక్షలు విలువ చేసే పశువులను తక్కువ ధరలకు కర్ణాటక రాష్ట్రంలోని చింతమణి సంతలో విక్రయిస్తున్నారు. ఉపాధి, వాటర్‌షెడ్ పథకాల్లో భాగంగా పశుగ్రాసాన్ని పెంచేందుకు ముందుకు వచ్చిన రైతులకు సంబంధిత శాఖ సిబ్బంది నుంచి ప్రోత్సాహం కరువైంది. కొంతమంది రైతులే ఈ ప్రయోజనాన్ని పొందుతున్నారు. పాడిరైతులకు ముందస్తు సమాచారం లేక ఉచిత విత్తనాలు అందలేదు. ఉపాధిహామీ పథకంలో పశుగ్రాసం పెంపకానికి చేపట్టిన కార్యక్రమం నివేదికలకే పరిమితమైంది. సమాచారం లోపంతో రైతులకు ఉచిత విత్తనాలు కరువయ్యాయి. ఇప్పటికే మండలవ్యాప్తంగా పశుసంపద తగ్గుముఖం పడుతోంది. పశు గ్రాసం కొరత అన్నదాతను కలవరపెడుతోంది. ఎడ్లబండిలోడ్ వరి గ్రాసానికి రూ.3వెయ్యికి పైగా, ట్రాక్టర్ వరి గ్రాసానికి రూ.10 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో పశు సంపదను కాపాడుకునేందుకు రైతులు నానాకష్టాలు పడుతున్నారు. పశువులను పోషిస్తున్న రైతులు గ్రాసం కోసం కొందరు రైతులు మాత్రమే అధిక ధరలు వెచ్చించి పశు సంపదను కాపాడుకుంటున్నారు.

మొక్కుబడిగా విత్తనాల పంపిణీ

ప్రభుత్వ పరంగా పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పంపిణీ చేసే గ్రాసం విత్తనాలు మొక్కుబడిగా అందిస్తున్నారు. గడ్డి లేక తక్కువ ధరకు పశువులను అమ్ముకున్నాం వేసవికాలం కరువు పరిస్థితులతో తక్కువ ధరలకు పశువులను విక్రయిస్తున్నాం. వేలకు వేలు డబ్బులు ఖర్చులు పెట్టినా గ్రాసం మార్కెట్లో దొరకడం లేదు. ప్రభుత్వం కల్పిస్తున్నా రాయితీలు అందడం లేదు. చివరికి పశుసంపద అంతరించి పోయే ప్రమాదం కనిపిస్తుంది. ఏంచేయాలో అర్థం కావడం లేదు.

- ప్రసాద్, రైతు, బైరాజువల్లి.

నానాతిప్పలు పడుతున్నాం

మూగజీవాలకు పశుగ్రాసం అందించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయల డబ్బులు పెట్టి వరిగడ్డి దిగుమతి చేసుకోవాల్సివస్తోంది. దీంతోఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నాం. ఈ సమస్యపై అధికారులు స్పందించి ప్రభుత్వం నుండి దాణా సబ్సిడీపై అందించడానికి చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాసులు, రైతు, నారేవారిపల్లి.

ఐసిడిఎస్‌ను బలోపేతం చేసుకుందాం : 'సిటు'

ప్రజాశక్తి - రాయచోటి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు వేగంగా చర్యలు చేపడుతున్న నేపథ్యంలో అందరూ ఐక్యంగా పోరాడి బలోపేతం చేసుకుందామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రాయచోటి శివ నర్సింగ్ కళాశాలలో అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూకుమ్మడిగా కార్మిక సంక్షేమం కోసం ఉన్న 44 చట్టాలను 4 చట్టాలుగా కుదించి కట్ట బానిసలుగా మార్చి కార్పొరేట్లకు కట్టుబెట్టే యోచనలో ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే కార్మికులు చైతన్యవంతమై ప్రజాఉద్యమాలు నిర్మించి ఐక్యంగా సుదీర్ఘ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు పి.బంగారు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి, అధ్యక్షులు శ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

డిఇఒగా శివప్రకాష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా విద్యా శాఖ అధికారిగా యు.శివ ప్రకాష్ రెడ్డి శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. గూడూరు ఉప విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. జిల్లా విద్యా శాఖ ప్రధాన కార్యాలయంలో పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘం నాయకులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివప్రకాష్ రెడ్డిని కలిసి పూల గుత్తి ఇచ్చి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అందుకు సిబ్బంది, సంఘ నాయకులు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

డిఇఒను సన్మానించిన ఉపాధ్యాయులు

పీలేరు : జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యు.శివప్రకాష్‌రెడ్డిని శనివారం పీలేరు డివిజన్ ఎస్‌టియు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు గంగిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కొత్తగా వచ్చిన డిఇఒ చొరవ చూపాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టియు ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, పీలేరు మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ అమర్నాథ్‌రెడ్డి, కలకడ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జగన్ సర్కారు అరాచకాలకు చరమగీతం'

ప్రజాశక్తి-మదనపల్లి

జగన్ సర్కారు అరాచకాలను అంతమొందించేందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పూరించారని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంఖారావం పేరుతో పర్యటిస్తూ ప్రజలకు జగన్ చేస్తున్న దౌర్జన్యాలను తెలియచేస్తూ, ప్రజలకు భరోసా కల్పించేలా శ్రీకారం చుట్టారని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు గాలి చలపతి నాయుడు, పట్టణ అధ్యక్షులు జోలేపాలెం భవాని ప్రసాద్, మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు యర్రబల్లి వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ముఖ్యమంత్రి జగన్ అరాచకాలకు చరమగీతం పాడటం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కడపలో టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డిలతో పాటు అతని కుటుంబ సభ్యులు, పార్టీ క్యాడర్ మీద కత్తులతో దాడులు చేయడం, ఎర్రదొంగలు కానిస్టేబుల్ గణేష్‌ను వాహనంతో ఢీ కొట్టి చంపేయడం చూస్తుంటే రాష్ట్రంలో పోలీసులకే భద్రత లేకుండా పోయిందన్నారు. **రాయచోటి:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పూరించిన నాథమే 'శంఖారావం' అని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే తెలుగుదేశం పార్టీ 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు .ఈ పర్యటనతో నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారని తెలియజేశారు. ఇప్పటికే యువగళం పాదయాత్ర ద్వారా జగన్‌రెడ్డి ప్రభుత్వం అరాచకాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ప్రజలకు వివరించారని, నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న యువతకు భరోసానిస్తూ పాదయాత్ర సాగించారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని అయన తెలియజేశారు. వైసిపి నాయకుల అవినీతి అన్యాయానికి వ్యతిరేకంగా 220 రోజులపాటు దాదాపు 3,132 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగించారని తెలియజేశారు. నారా లోకేష్ శంఖారావం ద్వారా పార్టీ కార్యకర్తలకు మరింత చేరువయ్యేలా చేస్తుందని, కార్యకర్తలు నేరుగా తమ అభిప్రాయాలను యువనేత లోకేష్ బాబుతో పంచుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'శంఖారావం' యాత్ర ద్వారా సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి లోకేష్ చేరువ అవుతారని తెలిపారు. ఇప్పటికే యువగళం పాదయాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో, పట్టణాలలో లోకేష్ పర్యటించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి ఇప్పటికే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని జోష్యం చెప్పారు.

మదనపల్లె : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

ఆర్థిక స్వావలంబన సాధించాలి : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అక్క, చెల్లెమ్మల జీవితాలలో వెలుగు నింపడం కోసమే వైయస్సార్ ఆసరా ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 4276 మంది మహిళలకు రూ.17.11 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అక్క, చెల్లెమ్మలకు అందే ఈ మొత్తాన్ని వారు ఎలా ఉపయోగించుకుంటారన్న అంశంపై ఎలాంటి షరతులు లేవన్నారు. వారి జీవితాలలో మరిన్ని కాంతులు తీసుకు రావాలని, వారి కుటుంబానికి సుస్థిరమైన ఆదాయం రావాలని, వారు సృష్టించుకునే వ్యాపార, జీవనోపాధి అవకాశాలకు ఈ ధనం ఉపయోగించుకుని పేర్కొన్నారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ లక్షాధికారులు కావాలనే మంచి ఆలోచనతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపరు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ప్రాజెక్టు ఎక్స్‌పో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రయోగాత్మక ప్రదర్శన ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2024 నేషనల్ లెవెల్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి.వి.ఎస్.గౌతమ్ ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ మోహన్‌బాబు యూనివర్సిటీ శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల తిరుపతి వారు మాట్లాడుతూ టెక్నాలజీ గురించి దాని ప్రాధాన్యత గురించి వివరిస్తూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకొని ఎన్నో కొత్త రకాల ప్రాజెక్టు తయారు చేయవచ్చని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. వీక్షించిన వారందరూ విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్. ఎస్.రామలింగారెడ్డి విద్యార్థుల అభినందిస్తూ సమాజానికి ఉపయోగపడే మరెన్నో కొత్త కొత్త ప్రాజెక్టులు తయారుచేసి భవిష్యత్తులో ముందుకెళ్లాలని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని క్రమశిక్షణతో మెలగాలని ఉపదేశించారు. ఈ ప్రదర్శనలో మంచి ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్, ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారు కలసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, వివిధ విభాగాధిపతులు కన్వీనర్ పి.గంగాధరరెడ్డి, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

అతిథులను సన్మానిస్తున్న డైరెక్టర్ రామలింగారెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి, డిఇఒ

ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టు ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో దేశవ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి ఎంపికైన 245 ప్రాజెక్టులను ఈ పోటీలలో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులంతా తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పోటీల నుంచి ఎవరికి మినహాయింపు లేదని ఆయన తెలిపారు. ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు రంజిత్ నాయక్, హబీబ్ పాల్గొన్నారు.

అసెంబ్లీకి ఎస్.ఎం.డి గౌస్ దరఖాస్తు

ప్రజాశక్తి - రాయచోటి

విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయచోటి అసెంబ్లీ టికెట్ కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎపిసిసి డెలిగెట్ ఎస్.ఎం.డి గౌస్ రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ కలకడ మహమ్మద్ షరీఫ్‌తో కలిసి శనివారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి 50 సంవత్సరాలుగా అనేక సేవలు చేశాను అన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

క్విస్ పోటీల్లో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

క్విస్ ఫెస్ట్‌లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి : ఆంధ్రప్రదేశ్ ఇంటర్ స్టేట్ లెవెల్ స్టూడెంట్స్ మీట్‌ను ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్విస్ ఫెస్ట్ 2024లో కళాశాలలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న ఎస్.బఋహీర్, అనికేత్ అరుణ్ సస్మాల్, పి.అన్వార్ అలీ ఖాన్‌లకు ప్రాజెక్ట్ ఎక్స్‌లో మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రరెడ్డి చేతులమీదుగా ఈ బహుమతి పొంది నట్లు, ప్రశంస పత్రం, షీల్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి అభినందనలు తెలియాజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-మదనపల్లి

క్షయ వ్యాధిగ్రస్తులను త్వరితగతిన గుర్తించడానికి ఖ్వాట్రా ట్రూనాట్ మిషన్ ఉపయోగపడుతుందని మెడికల్ కళాశాల, ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ జమున, డాక్టర్ ఎమ్.ఎస్.రాజు, డాక్టర్ పద్మాంజలిదేవి అన్నారు. శనివారం జిల్లా ఆసుపత్రి టిబి విభాగంలో నూతన ఖ్వాట్రా ట్రూ నాట్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి గ్రస్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనేక సేవలందిస్తున్నాయన్నారు. ఖ్వాట్రా ట్రూనాట్ మిషన్ జిల్లా ఆసుపత్రికి రావడం ఎంతో శుభసూచకమన్నారు. ఈ మిషిన్ ద్వారా ఒక గంటలో నలుగురి క్షయ అనుమానితులకు ఏక కాలంలో క్షయ ఉందా, లేదా అని నిర్ధారించవచ్చన్నారు. పట్టణ, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షయ అనుమానితులు రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, ఛాతీలో నొప్పి మొదలగు లక్షణాలలో ఏదైనా ఒక్క లక్షణాలు ఉన్నచో అటువంటి వారు సమీపంలోని ఆశా కార్యకర్తలను, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోవాలని పేర్కొన్నారు. క్షయ నిర్ధార్ణ అయినచో బాధితులు ఆరు నెలలు పాటు క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో మందులు మింగి క్షయ వ్యాధిని నయం చేసుకోవాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఒడిలు డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ బాబు, డాక్టర్ శశికళ, డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి, డాక్టర్ అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్‌నర్స్‌లు, టిబి విభాగం మదనపల్లి సిబ్బంది ప్రభాకర్, శాంతి, జ్ఞాన తిలగం, సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తుల కోసం మిషన్లను ప్రారంభిస్తున్న డాక్టర్లు

బరితెగింపు!

ప్రజా'దృష్టి'

ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడంలో వైఫల్యం వెక్కిరిస్తోంది. ఐదేళ్ల కిందట పోలీస్, అటవీ శాఖలు చేపట్టిన సంయుక్త నిఘా ఆశించిన సత్ఫలితాలు ఇవ్వలేదని అన్నమయ్య జిల్లా పీలేరు నియోజవర్గ పరిధిలోని కంభంవారిపల్లి మండలంలో స్మగ్లర్ల నిర్వాకం తెలియజెబుతోంది. స్మగ్లర్ల బరితెగింపు ఘటనలో అకారణంగా ఓ పోలీస్ మృతి చెందిన ఘటన ఆందోళన కలిగించింది. ఐదేళ్ల కిందటితో పోలిస్తే ఎర్రచందనం స్మగ్లింగ్ తగ్గుముఖం పట్టినట్లు పేర్కొంటున్న గణాంకాలపై సందేహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల మీదుగా ఎర్రచందనం తరలిపోతుండడం తాజా ఘటనే తార్కాణం. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయాల్లో స్మగ్లర్ల హవా నడుస్తూనే ఉంది. గతంలో ఐజి స్థాయి అధికారులు ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోదంపై టాస్కఫోర్స్ ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచడం తెలిసిందే. ఐదేళ్ల కిందట నుంచి టాస్కఫోర్స్ నిఘా కార్యకలాపాల పర్యవేక్షణను ఎస్‌పి స్థాయికి కుదించడంలో మర్మమేమిటనే సందేహాలు వ్యక్తమవు తుండడం గమనించాల్సిన విషయం. ప్రకృతి వనరుల్లో భూగోళంలోనే అరుదైన సంపద వృక్ష సంపద ఎర్రచందనం. తిరుపతి నుంచి కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని శేషాచల అడవుల్లో అపారంగా నిక్షిప్తమై ఉంది. ఇటువంటి అరుదైన వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బృహత్తర బాధ్యత పాలకులపై ఉంది. రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల అండదండలు లేకుండా స్మగ్లింగ్ నడవడ మనేది అసాధ్యమని చెప్పవచ్చు. ఇటువంటి అరుదైన వృక్షసంపద సీమకే తలమానికంగా నిలుస్తోంది. ఇటువంటి ప్రత్యేకతల్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. రాజకీయ నాయకత్వం బాధ్యత మరింత హెచ్చు. రాజకీయం మామూళ్ల మత్తులో జోగుతున్న కారణంగా ప్రకృతి సమతుల్యత ప్రశ్నార్థకంగా మారింది. వృక్షజాతుల్లోనే అరుదైన వృక్షాలుగా ఎర్రచందనం, రక్తచందనం, మందారం, బిల్వ కల్పవృక్షాలుగా పరిగణన పొందిన సంగతి తెలిసిందే. ఇటువంటి అరుదైన వృక్ష జాతులను సంరక్షణ అరణ్య రోదనగా మారింది. ప్రభుత్వం ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి సంబంధించి నిజాయతీ పరులైన ఉన్నత స్థాయి పోలీస్, ఫారెస్ట్ అధికారులను నియమించడం, ఖాళీలను భర్తీ చేయడం, ఆత్మరక్ష ణార్థం ఆయుధాలను సమకూర్చడం, వారి ఇతర అవసరాలకు ముఖ్యమంత్రి స్థాయిలో సహకారం అందిస్తే స్మగ్లింగ్‌ను అరికట్టడం సునాయాసమనే వాదన వినిపిస్తోంది. కడప జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు బరితెగింపును తలపించడం ఆందోళన కలిగింది. సార్వత్రిక ఎన్నికల ముంగిట అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు సాగించడం సహజం. కానీ ప్రతిపక్షాల ప్రజాస్వామిక రాజకీయాలను అడ్డుకునే స్థాయిలో ఉండడం అభ్యంత రకరం. ఇటీవల కడప జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని ముద్దనూరు మండలంలో ప్రతిపక్షాల కార్యకలాపాలకు అడ్డు తగలడం అప్రజాస్వామికం. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు పరస్పరం భౌతికదాడులకు పాల్పడడం, రాళ్ల రువ్వుకోవడం వంటి ఘటనలకు పాల్పడడం ఆందోళనకరం. కడప జిల్లా కేంద్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు ఆయుధాలతో దాడులకు పాల్పడడం, ఒకరు గాయాల పాలు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి అప్రజాస్వామిక ధోరణులకు ఎవరు పాల్పడినా క్షమార్హం కాదనే సంగతిని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న స్థానిక ప్రజలు

శ్మశాన వాటిక కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజాపురం ముష్టూరు దగ్గరలోని శ్మశాన స్థలాన్ని సమీపంలోని స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రధాన రహదారి నుంచి స్మశానానికి వెళ్లే మార్గంలో ట్రాక్టర్లతో ఏటి ఇసుకను తోలి స్మశానం కూడా పూడ్చి దారిని వెడల్పు చేసి స్విమ్మింగ్ పూల్కు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. స్విమ్మింగ్ పూల్కు వెళ్లడానికి వేరే మార్గం ఉండగా, ఈ దారి కేవలం శ్మశానానికి వెళ్లేందుకేనని గ్రామస్తులు అడ్డుకున్నారు. విఆర్ఓ నిరంజన్కు సమాచారం అందించి పనులు ఆపివేశారు. ఏటి పొరంబోకు స్థలం కావడంతో ఉప సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి వెంటనే ఇరిగేషన్ శాఖ ఎఇకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పనులు అడ్డుకున్న వారిలో ఉపసర్పంచ్ డి.శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, మాజీ ఎంపిటిసి మోహన్రెడ్డి, రవిచంద్రారెడ్డి, సుధాకర్రెడ్డి, బి.అనిల్, కె.శ్రీనివాసులురెడ్డి, శివశంకర్ రెడ్డిఉన్నారు.

విద్యార్థులకు వాటర్గీజర్ అందిస్తున్న పవన్కల్యాణ్

గురుకుల పాఠశాలకు వాటర్ గీజర్ వితరణ

ప్రజాశక్తి-కలకడ

కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు 15 లీటర్ల వాటర్ గిజర్ను వితరణ చేసినట్లు ప్రిన్సిపల్ అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్, సిఇఒ డాక్టర్ ఎం.పవన్కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో పాఠశాలను సందర్శినప్పుడు విద్యార్థులు మాకు గిజర్ కావాలని అడగారని వారి అభ్యర్థన మేరకు గీజర్ను అందించినట్లు తెలిపారు. కస్తూరిబాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిను అందించారు. పభుత్వం కల్పిస్తున్న అవకాశాలు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుబ్ర హ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఈ వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం స్వామివారికి గజారోహణ, సాయంత్రం కను విందుగా పల్లకి సేవ నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్భట్టార్, అర్చకులు రమేష్ బాబులు, వేద పండితులు సంప్ర దాయ బద్ధంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. టిటిడి ధర్మ ప్రధాన పరిషత్ ఆధ్వర్యంలో రాత్రి హరికథ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటి డిఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపీనాథ్, ఇన్స్పెక్టర్ దీక్షిత్ కుమార్ పాల్గొన్నారు.

గేటు వద్ద నిర్మాణంలో ఉన్న మోరీ

పూర్తి కావస్తున్న మోరీ నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు-రాయచోటి పరిధిలో గేటు వద్ద రూ.1.20 కోట్లతో చేపట్టిన మోరీ నిర్మాణం పూర్తి కావస్తోందని ఆర్అండ్బి ఎఇ యూసుఫ్ పేర్కొన్నారు. గాలివీడు-రాయచోటి మార్గంలో రోడ్డు మరమ్మతులకు విడుదలైన నిధులతో పనులు చేపట్టామని అన్నారు. రూ.1.40 కోట్ల వ్యయంతో మూడున్నర కిలోమీటర్ల పరిధి వరకు రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో మోరీ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తారు రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

అభయక్షేత్రంలో జగదీష్కుమార్, మిత్రులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-చిట్వేలి

మాజీ ప్రధాని పివి.నరసింహారావు భారతరత్న, సినీ హీరో చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డులు ప్రకటించిన సందర్భంగా మండల పరిధిలోని అనుంపల్లికు చెందిన గుత్తి జగదీష్కుమార్ ఆధ్వర్యంలో అభయక్షేత్రంలో 200 మంది వృద్ధులు, పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతిని తెర పైన చూపిం చడంలోనూ భారతదేశంలో తెలుగోడి గొప్పతనాన్ని తెలియజేయడంలోనూ ఇద్దరి పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని అభాగ్యులకు అన్నదానం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పసుపులేటి వెంకటరమణ, మాదినేని బాల, పసుపులేటి తేజ, గుత్తి మురళి, మాదినేని రాజా పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప సహకారంతో శ్రీ సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి మాస్టర్ సూర్య వారి చిన్నారులచే క్లాసికల్, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధితులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలంలో నీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మండల స్థాయి అధికారులు వారి వారి నివేదికలను చదివి వినిపించారు. ప్రజల ఆరోగ్యం పట్ల వైద్యాధికారులు శ్రద్ధ వహించి వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు వ్యవసాయ అధికారులు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండి వారికి సహకరించాలని పేర్కొన్నారు. రైతులకు కావలసిన విద్యుత్ను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్శాఖ అధికారులను కోరారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి కావలసిన సేవలు అందించడంలో ఏమాత్రం వెనుకబాటు వేయమని ఎంఎడిఒ పరమేశ్వర్రెడ్డి తెఇపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఈశ్వర్ నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ మోహనరాజా నాయుడు, సింగల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఆర్బికె చైర్మన్ హరినాథ్రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జివి.కిషోర్, ఇనాయతుల్లాఖాన్, సర్పంచ్లు, ఎంపిటిసిలు, ఎంఇఒ రామచంద్రారెడ్డి, ఇఒపిఆర్డి లతీఫ్ ఖాన్, ఎపిఒ చెన్నకేశవులు, ఎపిఎం రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ఇరగన్న, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, విఆర్ఒలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎస్ఐ

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం పవర్ జిమ్లో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లను స్మరించుకుంటూ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిమ్ నిర్వాకుడు పెనుబాల శేఖర్, సంఘసేవకులు సయ్యద్ అహ్మద్లు పేర్కొన్నారు. ఎస్ఐ షేక్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. 28మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినంద ీనీయమన్నారు. అమర జవాన్లను స్మరించుకుంటూ రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. యువకులు ప్రతి మూడు నెలలకోసారి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, తను కూడా ఇప్పటివరకు 15 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, షబ్బీర్, రమేష్ కత్తి, వాణి, రెడ్డి రాణి, గణేష్, శ్రావణ్, నాసిర్, శివ, అమరనాథ్, ముఖ్తీయార్, చక్రి, నాసిర్, వేణు కత్తి, పూణీత్, అస్లాం, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం : ఎంఇఒ

ప్రజాశక్తి-గాలివీడు



నిర్మాణంలో ఉన్న ఉర్దూ పాఠశాల ఆర్చీ

మండల పరిధిలోని గోరాన్ చెరువు పంచాయితీ గేటు వద్ద ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు నాడు-నేడు పనులకు నిధులు మంజూరు కావడంతో నిర్మాణ పనులను వేగవంతం చేశామని ఎంఇఒ పిల్లి నాగరాజు తెలిపారు. విద్యార్థులకు సౌకర్యవంతంగా పాఠశాలలో వంటగది, మరుగుదొడ్లు, ప్రహరీ, ఆర్చి నిర్మాణాలను చేపట్టామని తెలిపారు. పనులను నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఆహ్లాదకర వాతారవణం కల్పించి ఉత్తమ విద్యను అందించడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రాథమిక పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రంలో కూడా నాడు-నేడు కింద నిర్మాణం పలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి అన్ని ప్రాథమిక ప్రాథమిక , ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ, ఆర్చీలు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు.

పోషకాహారంతో అధిక పాల దిగుబడి

సమావేశంలో మాట్లాడుతున్న లింగారావు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పాడి రైతులు పశువుల పోషణలో మెలకువలు పాటించి పోషకాహారం అందిస్తే అధిక పాల దిగుబడితో మంచి ఆదాయం పొందవచ్చునని శ్రీజ డైరీ జోనల్ మేనేజర్ లింగారావు తెలిపారు. శనివారం స్త్రీశక్తి భవన్లో మదనపల్లి జోన్ ఏరియా ఆఫీసర్లు, సూపర్వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాడి ఆవుల పోషణలో మెలకువలపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారం విలువలను తెలి యపరచి అధిక పాల దిగుబడి ఇచ్చే ఆవులకు అదనంగా దాన, మినరల్ మిక్సర్ వంటి వాటిని వినియోగించే విధంగా సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్లు గంగయ్య నారాయణరెడ్డి, కృష్ణప్ప, మునికృష్ణ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

విద్యే ప్రగతికి సోపానం

మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత మాధవి

ప్రజాశక్తి-పీలేరు

విద్యే ప్రగతికి సోపానమని, విద్య ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమని వక్తలన్నారు. రెండు రోజుల పాటు పీలేరు విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో అతిథులు తెలిపారు. విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి అధ్యక్షతన శుక్ర, శనివారాల్లో జరిగిన వేడుకల్లో అతిథులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఉన్నతమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో విద్యా రంగ అభివృద్ధికి ప్రోత్సహిస్తోందని అన్నారు. ఓ వైపు ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చేస్తూ, మరోవైపు ప్రయివేట్ కార్పోరేట్ విద్యాసంస్థల్లోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్న నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక సమస్యలు ఎన్నున్నా విద్య రంగా అభివృద్ధికి దృష్టి సారిస్తోందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యయ ప్రయాసలకు ఓర్చి తమకు నచ్చిన విద్యాసంస్థల్లో చేరుస్తూ, వారి బంగరు భవిష్యత్తుకు పాటుపడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండు రోజుల కార్యక్రమాల్లో రాయలసీమ పశ్చిమ విభాగం ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఎంవి రామచంద్రారెడ్డి, సిఐ మోహన్ రెడ్డి ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, అపస్మా రాష్ట్ర అధ్యక్షులు రఘునాథరెడ్డి, కడప అధ్యక్షులు రమణారెడ్డి, అపుస్మా నాయకులు గంగయ్య, విశ్వం విద్యా సంస్థల అధినేత విఆర్ రెడ్డి, జ్యోతి ప్రతిఫలాలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండవ రోజు స్మార్ట్ కిడ్స్, ఒలంపియాడ్ విద్యాసంస్థల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి, ఎంపిఐ అధికారిణి విజయకుమారి, సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసిరెడ్డి

వైఎస్ఆర్ ఆశయాల కోసం కాంగ్రెస్లోకి రండి

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ఆర్ ఆశయాల కోసం కాంగ్రెస్ పార్టీలోకి రండని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి చిత్తుచిత్తుగా ఓడిపోతుందని తెలిపారు. సిఎం జగన్ పని కూడా అయిపోయిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వైసిపి ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెప్పారు. రైతులు రగిలిపోతుండగా, మహి ళలు మండిపడుతున్నారన్నారు. నిరుద్యోగులు కూడా నిరాశతో ఉన్నట్లు తెలి పారు. సర్పంచ్లు, కాంట్రాక్టర్లు కసితో ఉన్నారన్నారు. రాష్ట్రం అప్పులు, అవినీతి, అరాచకం, మద్యం, జూదం, గంజాయి, బూతుల ఆంధ్రప్రదేశ్గా తయారైనట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 10ఏళ్ల అరణ్యవాసం ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఎఐసిసి సభ్యుడు ధ్రువకుమార్రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, మండల ఉపాధ్యక్షుడు బద్రీనాథ్, మండల కాంగ్రెస్ నాయకులు రవి, శివయ్య పాల్గొన్నారు.

అధికారులు వేధించడం మానుకోవాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

చాలీచాలని వేతనాలతో బతకలేక కడుపు మండి కార్మికులు ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడితే.. దాన్ని సాకుగా చూపి అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్మికులను వేధిం చడం మానుకోవాలని సిఐ టియు జిల్లా కార్యదర్శి సత్య నారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు మున్సిపాల్టీలోని కార్మికులు దాదాపు 20 ఏళ్ల నుంచి తక్కువ వేతనాలతో బతుకీడుస్తున్నారన్నారు. తమ వేతనాలు పెంచుకోవాలంటే ధర్నాలు చేయడమో, గత్యంతరంలేని పరిస్థితుల్లో సమ్మె చేయడమో జరగుతోందన్నారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల తలరాత మాత్రం మారడం లేదన్నారు. కార్మికులు ఆందోళనా కార్యక్రమాలు చేస్తున్నారనే కారణంగా డివిజన్లు మార్చడం, బెదిరింపులకు దిగడం జరుగుతోందన్నారు. రోడ్లు ఊడ్చుకొని, మురికి కాలువలు శుభ్రం చేసే కార్మికులపై ఇలాంటివి తగదని సూచించారు. వేధింపులు మానుకోని పక్షంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనా కార్యక్రమాలకు దిగాల్సి వస్తుదని వారు హెచ్చరించారు. సమావేశంలో ఆటో సంఘ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ సంకల్పమని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్రెడ్డి అన్నారు. శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని 12వ కౌన్సిల్ వారులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని తెలిపారు. ప్రతి ఇంటికీ తిరుగతూ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్రెడ్డి, వార్డు ఇన్ఛార్జి యూసఫ్,పాల్గొన్నారు.

అరాచక పాలనపై లోకేష్ పూరించిన నాదమే 'శంఖారావం'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సిఎం వైఎస్.జగన్మోహన్రెడ్డి, వైసిపి నాయకుల అరాచ కాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాదమే శంఖారావం అని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి విజయ్కుమార్రెడ్డి, విశ్వనాథ, రాఘవరెడ్డి, విజయభాస్కర్రెడ్డి, గురివిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటిస్తారన్నారు. ఈ సందర్భంగా జగన్రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలు, కార్యకర్తలకు వివరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు శంఖారావం అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

పాఠశాల కంచె ఏర్పాటును పరిశీలిస్తున్న హెచ్ఎం

పాఠశాల చుట్టూ కంచె ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీకి ఓవైపు గోడ లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎంపి-1 మిట్టపల్లి యదుభూషణ్రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి 50 స్తంభాలతో కంచె ఏర్పాటు చేయిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్గౌస్ పేర్కొన్నారు. మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాల చుట్టూ మైదానం ఏర్పాటు చేసి ఒకవైపు గార్డెన్లాగా పూల మొక్కలను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు అభివృద్ధికి సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షుడు కానాల శివారెడ్డి, మహమ్మద్గౌస్ , సుబ్బరాయుడు, బయరెడ్డి, పీడీ గంగరాజు పాల్గొన్నారు.



గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కొరముట్ల

'గండ్ర' దంపతులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తెలంగాణలోని వరంగల్ జిల్లా, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆయన భార్య వరంగల్ జడ్పి చైర్మన్ గండ్ర జ్యోతి ఆధ్వరంలో భూపాలపల్లి నుంచి తిరుమలకు చేస్తున్న మహా పాదయాత్ర శనివారం అనంతరాజుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వారిని ఘనస్వాగతం పలికి గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్రెడ్డి, ఉప సర్పంచ్ తోటశివసాయి, జడ్పిటిసి సభ్యులు పి.రత్న మ్మ, నగిరి పాడుశివారెడ్డి,రమణారెడ్డి, సర్పంచ్ రఫీ, శ్రీనివాసులు రెడ్డి, బికె.మని, రమణ, కరీముల్లా, సిద్దు, సుకుమార్ పాల్గొన్నారు.

అహ్మద్బాషాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కడప ఎమ్మెల్యే అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాపై పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మైనారిటీ విభాగ జిల్లా సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ మొహిద్దీన్ కోరారు. మండలం పరిధిలోని సర్వర్ఖాన్పేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అహ్మద్ బాషా కడప నగరంలోని మైనారిటీలపై దాడులకు పాల్పడుతుండడం, భూకబ్జాలకు దిగుతూ అరాచకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డిపై దాడి చేస్తామంటూ మాట్లాడడమే కాకుండా, అసభ్య పదజాలంతో పార్టీ శ్రేణులను రెచ్చ గొట్టేలా ప్రవర్తించడం పద్ధతి కాదని హెచ్చరించారు. శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం అది వారి నిర్లక్ష్య కారణమన్నారు. ప్రభుత్వ అండదండలతో పోలీసులు ఇలా ప్రవర్తించడం ఆ శాఖకే చెడ్డ పేరన్నారు. ఇప్పటికైనా పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా బిటెక్ రవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి పులివెందుల ఇన్ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, అబ్దుల్ ఆధ్వర్యంలో కడప బైపాస్ రోడ్డులో కేక్ కట్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. రాజీవ్నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానంతోపాటు దుస్తులను మైనార్టీ నాయకుడు అబ్దుల్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జయచంద్రారెడ్డి, నిమ్మకాయల దర్బార్, వేమకుమార్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో మృతి చెందిన పొట్టేళ్లు

బొలెరో బోల్తా : పది పొట్టేళ్లు మృతి

-ఇద్దరు వ్యాపారులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-మదనపల్లి

మండల సమీపంలోని బసినికొండ బైపాస్ రోడ్డు, సాయిబాబా గుడి సమీపంలో అడవిలోపల్లి నుంచి పొట్టేళ్లను అంగళ్ళు గొర్రెల సంతకు తరలిస్తున్న టాటా ఎస్ వాహనం శనివారం వేకువ జామున అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది పొట్టేళ్ళు మృతిచెందగా, మరో ఏడు పొట్టేళ్ళు, మేకలు, వాటి పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి. పొట్టేళ్లను సంతకు తరలిస్తున్న స్థానిక ఈశ్వరమ్మ కాలనీకి చెందిన వ్యాపారి సైపుల్లా, ఆయన కుమారుడు బాషా, కొండామారిపల్లి, గ్రామం బోడిమల్లు దిన్నెకు చెందిన రామయ్యలకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గరికి స్వల్ప గాయాలు అవడంతో 108 సిబ్బంది గాయపడిన వారిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తామనిపేర్కొన్నారు.

ఆర్టిసి బస్సు, బైక్ ఢీ : వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట దగ్గర కడప-చెన్నై జాతీయ రహదారిపై రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఆర్టిసి బస్సు బైక్ పై వెళుతున్న వ్యక్తి ఢీకొనడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ రఘురాం తెలిపారు. మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీ, వడ్డిపల్లి గ్రామానికి చెందిన బత్తెన ప్రసాద్(43) ఇంటి నుంచి బైక్ వెళుతుండగా అప్పయ్యరాజుపేట దగ్గర ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొని తీవ్రంగా గాపడ్డాడని తెలిపారు. గాయపడిన బాధితుడిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అక్కడా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని చెప్పారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.